క్లుప్తంగా

కోటదుర్గమ్మ హుండీ ఆదాయం రూ.3.63 లక్షలు

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను ఆలయ ఈఓ మురళీకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం లెక్కించారు. జూలై 10 నుంచి ఈనెల 13 వరకు 32 రోజులకు గాను హుండీల ద్వారా రూ.3,63,821లు ఆదాయం సమకూరిందని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షణ అధికారి కె.వెంకటరమణ, ఉపప్రధాన అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అండర్-16 జిల్లా జట్టులో స్థానం


శివకుమార్‌ను అభినందిస్తున్న కొండలరావు, తదితరులు

పాలకొండ: పట్టణంలోని గొల్లవీధికి చెందినన చిన్ని శివకుమార్ అండర్-16 జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా క్రికెట్ అసోసియేషన్ నుంచి శివకుమార్‌కు పిలుపు అందింది. ఈ సందర్భంగా శివకుమార్‌ను షిర్డీసాయి ఆలయ నిర్వాహకులు, నగరపంచాయతీ మాజీ చైర్మన్ పల్లా కొండలరావు అభినందించారు. జిల్లా స్థాయిలో రాణించి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. అందుకు కావాల్సిన ప్రోత్సాహాన్ని అందిస్తామన్నారు. తమ కుమారుడు క్రీడల్లో రాణించడంపై శివకుమార్ తల్లిదండ్రులు చిన్ని నీలకంఠం, నీలవేణి ఆనందం వ్యక్తం చేశారు.

కుమ్మరిగుంటలో వైద్యశిబిరం

కొమరాడ: మండలంలోని కుమ్మరిగుంట గ్రామంలో కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు సీహెచ్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అనారోగ్యం బారిన పడిన వారికి రక్తపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశామని తెలిపారు. గ్రామంలోని పారిశుద్ధ్యంపై పంచాయతీ కార్యదర్శికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది టి.విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రమదానం


భాసూరు వద్ద తోటపల్లి కాలువలో పూడిక తొలగిస్తున్న రైతులు

పాలకొండ రూరల్: భాసూరు సర్పంచ్ శిర్లాపు మల్లేశ్వరమ్మ ఆధ్వర్యంలో తోటపల్లి ఎడమ కాలువలో సోమవారం పూడిక తీతలు చేపట్టారు. భాసూరుతో పాటు చింతాడ, వాటపాగు, పద్మాపురం గ్రామాలకు చెందిన రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమవంతు సహకారం అందించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన చెత్త, గుర్రపుడెక్క, తూడిబద్దు పేరుకుయి నీటి సరఫరాకు ఆటంకంగా మారాయి. రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పూడికలను తొలగించారు.

భరతమాత అలంకరణలో..



భామిని: పంద్రాగస్టు వేడుకల నిర్వహణకు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు ముస్తాబవుతున్నాయి. చిన్నారుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా దిమ్మిడిజోలకు చెందిన తల్లిదండ్రులు తమ చిన్నారిని ఇలా భారత మాత వేషధారణలో అలంకరించారు.

పారదర్శకంగా పన్నుల వసూలు

పాలకొండ రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు నేటి నుంచి గ్రామస్థాయిలో పన్నుల వసూలు ప్రక్రియ డిజిటల్ విధానంలో పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి అన్నారు. మండలంలోని బెజ్జి సచివాలయంలో కార్యదర్శులతో సోమవారం సమావేశం చేపట్టారు. ఉన్నతాధికారుల సూచనలతో క్యూఆర్ కోడ్ ద్వారా పన్నులు వసూలు చేయాలన్నారు. నగదురహిత లావాదేవీలను ప్రోత్సహించటం, ప్రజల్లో చైతన్యం తీసుకురావటంతో ఖజానాకు చేరాల్సిన సొమ్ము నేరుగా ప్రభుత్వ అకౌంట్‌కు చేరుతుందన్నారు. ఈ విధానంలో ఎటువంటి అవకతవకలకు అస్కా రం ఉండదన్నారు. సిబ్బంది కచ్చితంగా నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించాలన్నారు.


పాలకొండ రూరల్: లుంబూరులో వసుధకు వందనం ర్యాలీలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు


పాలకొండ: ప్రభుత్వ జూనియర్ కాలేజీ(బాలురు)లో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు


భామిని: పెద్దదిమిలిలో శిలాఫలకం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్ శ్రీను, ఎంపీడీఓ చంద్రరావు


కురుపాం: బియ్యాలవలసలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సుజాత, తదితరులు

అమరవీరుల త్యాగం మరువలేనిది

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి
- స్వాతంత్య్ర సమరయోధులకు ఘన నివాళి



వీరఘట్టం: వండవలో 'నామట్టి-నాదేశం' కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: అమరవీరుల త్యాగ ఫలితంగా నాడు భారతదేశానికి స్వాతంత్య్రం వచ్చిందని, వారి త్యాగాలను మనం ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. వండవ జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన 'నామట్టి-నాదేశం' కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాలు ఎగురవేయాలని పిలుపునిచ్చారు. చిదిమిలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, సర్పంచ్ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో, తూడిలో వైస్ ఎంపీపీ పర్రి విజయకుమారి, సర్పంచ్ కుద్దిగాన వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో, పాలమెట్టలో సర్పంచ్ జగన్ ఆధ్వర్యంలో 'నామట్టి-నాదేశం' కార్యక్రమాన్ని నిర్వహించారు.

బియ్యాలవలసలో..

కురుపాం: మండలంలోని బియ్యాలవలసలో ఉపాధి, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం 'నా భూమి-నాదేశం' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం స్థానిక మండల పరిషత్ పాఠశాల విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సచివాలయ కార్యదర్శి అనూరాధ, పాఠశాల హెచ్‌ఎం అమరావతి, ఉపాధ్యాయులు ఉపేంద్ర, సర్పంచ్ పత్తిక అజారీ, మాజీ సర్పంచ్ పత్తి పాల్గొన్నారు.

నేలతల్లికి వందనం

పాలకొండ రూరల్: పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని లుంబూరు సర్పంచ్ తిర్లంగి ఉపేంద్రకుమార్ అన్నారు. గ్రామంలో సోమవారం 'నామట్టి-నా దేశం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేలతల్లిని కన్నతల్లిగా భావించి కాపాడుకోవాలన్నారు. అనంతరం మొక్కలు నాటారు. విద్యార్థులతో కలిసి జాతీయ జెండాలను చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. ఉప సర్పంచ్ పడాల రామచంద్రరావు, ఉపాధి ఈసీ పద్మజ, ఎస్.నాగభూషణరావు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి కృషిచేయాలి

పాలకొండ: ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో సోమవారం 'నా భూమి-నా దేశం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్య్ర పోరాటంలో అమరులైన దేశభక్తులకు నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో నిర్వర్తించి దేశాభివృద్ధికి కృషిచేయాలని కోరారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వి.అప్పారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాలు మరువలేం..

కొమరాడ: స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను మరువలేమని సర్పంచ్ జి.శ్రీనివాసరావు అన్నారు. నిమ్మలపాడు గ్రామంలో సోమవారం 'నాభూమి-నాదేశం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన నాయకులు, సైనికులను స్మరించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

భారతమాతకు రుణపడి ఉందాం..

భామిని: భారతమాతకు రుణపడి ఉందాం, భూమాతను కాపాడుకొందామని వైఎస్సార్‌సీపీ నాయకులు కొవ్వాడ చిరంజీవులు, సర్పంచ్ తొగరాన శ్రీను, లోతుగెడ్డ రవికుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని పెద్దదిమిలి, చిన్నదిమిలి, కీసర, కోసలి, సతివాడలలో ఎంపీడీఓ జి.చంద్రరావు, ఏపీఓ తులసీదాస్ ఆధ్వర్యంలో 'నాభూమి-నాదేశం' కార్యక్రమాలను నిర్వహించారు. స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను గుర్తుచేసుకుని, వారికి నివాళులర్పించారు. భూమాతకు పూజ చేసి మొక్కలు నాటారు.

ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

గరుగుబిల్లి: హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు అన్నారు. మండలంలోని గరుగుబిల్లి, ఉల్లిభద్ర, రావివలస, నాగూరు, తోటపల్లి తదితర గ్రామాలలో సోమవారం 'నా భూమి-నా దేశం' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. దేశ రక్షణలో ప్రాణాలర్పించిన సైనికులకు నివాళులర్పించారు. స్వాతంత్య్ర దినోత్సవ కార్యక్రమంలో ప్రజలంతా పాల్గొనాలని కోరారు.


గరుగుబిల్లి: ఉల్లిభద్రలో విద్యార్థుల మానవహారం


వీరఘట్టం: చిదిమిలో 'నాభూమి-నాదేశం' కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ దమలపాటి

గిరిజన స్పందనకు 66 వినతులు


వినతులు స్వీకరిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: స్థానిక ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన గిరిజన స్పందనకు 66 వినతులు వచ్చాయి. ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి వినతులు స్వీకరించారు. సొలికిరికి చెందిన సరోజిని సీహెచ్‌డబ్ల్యూ పోస్టు భర్తీ చేయాలని, కిట్టాలపాడుకు చెందిన కె.లక్ష్మయ్య పవర్‌వీడర్ మంజూరు చేయాలని, ఎ.రాజబాబు ఆటో కొనుగోలుకు రుణ సౌకర్యం కల్పించాలని కోరారు. సోమయ్యపేటకు చెందిన సరోజిని రైస్‌కార్డులో పేరు నమోదు చేయించాలని, సీమలగూడ జయప్రకాష్ సవర భాషా వలంటీర్ పోస్టు ఇప్పించాలని విన్నవించారు. స్పందనలో ఏపీఓ రోసిరెడ్డి, ఈఈ సింహాచలం, డీడీ శ్రీనివాసరావు, డిప్యూటీ ఈఓ లిల్లీరాణి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్యాంబాబు


డాక్టర్ ఎం.శ్యాంబాబు

పాలకొండ రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఎం.శ్యాంబాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన తాడేపల్లిగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. కళాశాల అధ్యాపకులు ఆయనకు మర్యాదపూర్వకంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1997 నుంచి సుమారు నాలుగేళ్లుగా ఇదే కళాశాలలో రసాయనశాస్త్ర అధ్యాపకునిగా పనిచేసినట్లు చెప్పారు. నాటి అనుభవంతో కళాశాల అభ్యున్నతికి, విద్యార్థుల ఉన్నతికి కృషిచేస్తానన్నారు. ఇదివరకు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన డాక్టర్ జి.జనార్దననాయుడు బదిలీపై విజయనగరం ప్రభుత్వ డిగ్రీ సాంస్కృత కళాశాలకు వెళ్లారు.

ఆరోగ్య తనిఖీలు పక్కాగా నిర్వహించాలి


ఉద్దవోలులో సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఐఓ డా.జగన్మోహనరావు

గరుగుబిల్లి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆరోగ్య పరీక్షలు పక్కాగా నిర్వహించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. మండలంలోని ఉద్దవోలులో సోమవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఓపీ రికార్డులో నమోదు చేసిన రోగుల వివరాలను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య తనిఖీలు చేపట్టాలని, రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించి మందులు, పౌష్టికాహారం అందించాలని సూచించారు. ప్రస్తుత సీజన్‌లో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సాగర్‌వర్మ, సూపర్‌వైజర్లు ఉదయకుమారి, జయగౌడ్ తదితరులున్నారు.

గుమ్మ సర్పంచ్ బరిలో నలుగురు అభ్యర్థులు

కురుపాం: మండలంలోని గుమ్మ గ్రామ సర్పంచ్ స్థానానికి నలుగురు అభ్యర్థులు బరిలో ఉన్నట్లు ఆర్ఓ పి.నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల గుమ్మ సర్పంచ్ మృతితో ఆ స్థానానికి ఎన్నిక నిర్వహించేందుకు నోటిఫికేషన్ ఇవ్వగా.. ఐదుగురు అభ్యర్థులు నామినేషన్ వేసినట్లు చెప్పారు. సోమవారం ఒక అభ్యర్థి నామినేషన్ ఉపసంహరించుకోవడంతో ప్రస్తుతం ఆరిక గోపాలరావు, కొండగొర్రి వెంకటరావు, బిమ్మక భానుప్రసాద్, తోట పట్టయ్య బరిలో ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 19న పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే బియ్యాలవలస పంచాయతీలో ఖాళీ అయిన వార్డు మెంబర్ స్థానానికి టి.భారతి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆర్ఓ ప్రకటించారు.

పనుకువలస సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం

పాలకొండ రూరల్: మండలంలోని పనుకువలస సర్పంచ్ కోట ముకుందనాయుడు మృతిచెందడంతో ఆ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించేందుకు ఇటీవల రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే గ్రామస్తులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఏకమై ముకుందనాయుడు కుటుంబ సభ్యురాలైన కోట మంజుభార్గవిని సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని నిర్ణయించారు. సర్పంచ్ స్థానానికి మంజుభార్గవి ఒక్కరే నామినేషన్ వేయడంతో ఆర్ఓ ప్రవల్లిక, ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ మేరకు సోమవారం డిక్లరేషన్ పత్రాలను అందజేశారు. అలాగే మండలంలోని అన్నవరం పంచాయతీ 6వ వార్డు(ఎస్సీ ఆల్) స్థానంకు రాగోలు చంద్రశేఖర్, వీపీ రాజుపేట పంచాయతీ ఒకటవ వార్డు (బీసీ జనరల్) స్థానానికి శాసపు లక్ష్మీనారాయణ, ఇదే పంచాయతీలో 7వ వార్డు (ఎస్సీ జనరల్) స్థానంకు బొమ్మలాట శాంతమ్మ మాత్రమే నామినేషన్లు వేయటంతో వారంతా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ స్టేజ్-1 అధికారులు డొంక త్రినాథులు, కె.సోంబాబు ప్రకటించారు.

ఎఫ్ఏ-1 ప్రోగ్రస్ కార్డుల అందజేత



ప్రోగ్రస్‌కార్డులు చూపిస్తున్న ఉపాధ్యాయులు

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమపాఠశాల విద్యార్థినులకు సోమవారం ఎఫ్ఏ-1 ప్రోగ్రస్ కార్డులను అందజేశారు. హెచ్‌ఎం ఎ.లిల్లీరాణి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విద్యార్థినుల తల్లిదండ్రులకు మార్కుల జాబితాలను అందించి, తమ పిల్లలు ఎలా చదువుతున్నారో తెలియజేశారు. బైజూస్, టోఫెల్ వంటి టెక్నాలజీతో ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన చేపడుతున్నట్లు చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సీతంపేట: భామిని మండలం లివిరి గ్రామానికి చెందిన ఎస్.గుడ్డు (52) గత కొద్దిరోజులుగా జ్వరం, పచ్చకామెర్లతో బాధపడుతున్నాడు. ప్లేట్‌లెట్ కౌంట్ తగ్గడంతో తీవ్ర అవస్థతకు గురైన ఆయన్ను కుటుంబ సభ్యులు సీతంపేట ప్రాంతీయ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు.

జగనన్న మహిళా పక్షపాతి

- పెరిగిన మహిళల గౌరవం
- సీఎం పాలనలో తగ్గిన పేదరికం
- హోం మంత్రి తానేటి వనిత


మాట్లాడుతున్న రాష్ట్ర హోం, విపత్తుల శాఖ మంత్రి తానేటి వనిత, ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: దివంగత మహానేత, వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల కోసం ఒక అడుగు ముందుకు వేస్తే అదే పేదలకోసం ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగు అడుగులు ముందుకేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్తున్నారన్నారని రాష్ట్ర హోం, విపత్తుల శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె పార్వతీపురం మండలం చినబొండపల్లి గ్రామంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న క్షేత్రస్థాయిలో చిన్నపాటి సమస్యను కూడా తీరుస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రతి వర్గాన్ని గుర్తించి గౌరవిస్తూ, వారి ఆత్మ గౌరవాన్ని కాపాడే విధంగా పరిపాలన అందిస్తున్నారన్నారు.

వైఎస్సార్‌సీపీ బలం జగనన్న సైన్యమే

2019లో 151 స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవశం చేసుకోవడానికి గల కారణం జగనన్న సైన్యమే. జగనన్న సంక్షేమ పాలన పొందుతున్నామంటే మనమంతా జగనన్నకు బలంగా ఉండడమే కారణమన్నారు.

మహిళా పక్షపాతిగా పెంచిన గౌరవం

జగనన్న మహిళా పక్షపాతిగా మహిళల గౌరవాన్ని పెంచారన్నారు. నాలుగు సంవత్సరాల పరిపాలన కాలంలో రాష్ట్రంలో ఏ సంక్షేమ పథకాన్ని అమలు చేసినా అన్ని పథకాలు మహిళల పేరిట అందజేశారని చెప్పారు. ఇటువంటి మహిళా సంక్షేమ పాలన భారత దేశంలో ఎక్కడా లేదన్నారు. మహిళలంతా సాధికారత సాధించాలని మహిళల పేరిట పథకాలు అందజేస్తూ ఆత్మ గౌరవాన్ని కాపాడుతున్నారన్నారు. మహిళలంతా జగనన్నకు ఆత్మబంధువుగా నిలవాలని కోరారు.

జగనన్న పాలనలో పేదరికం పరారీ

చంద్రబాబునాయుడు పరిపాలనలో పేదరికం 12శాతం ఉంటే జగనన్న పాలనలో 6శాతానికి తగ్గిందన్నారు. జగనన్న ఇస్తున్న సంక్షేమ పథకాల వల్ల ప్రతి పేదవాడు పేదరికం నుంచి బయటకు వస్తున్నాడన్నారు. ఇవన్నీ చూడలేక కొంతమంది నాయకులు ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నంలో భాగంగా పేదలను సోమరిపోతులను చేస్తున్నారని ఆరోపిస్తున్నారన్నారు. అందరి కుటుంబాల్లో పేదరికాన్ని దూరం చేయడం కోసం, పేదింటి పిల్లలను విద్యావంతులను చేయడం కోసం ప్రతి కుటుంబంలో విద్యా దీపాన్ని వెలిగించిన ముఖ్యమంత్రి కేవలం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డేనన్నారు.

జోగారావును భారీ మెజార్టీతో గెలిపించాలి

ఎన్నికలు ఎప్పుడొచ్చినా మీరంతా కలిసికట్టుగా ఉండిఐక్యతగా, బాధ్యతగా పార్వతీపురం నియోజకవర్గం నుంచి అలజంగి జోగారావును అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా మళ్లీ గెలిపించి జగనన్నకు బహుమతిగా ఇవ్వాలని అందరినీ కోరుతున్నానన్నారు.

జనసేనకు జెండా, అజెండా లేదు

జనసేన పార్టీకి జెండా, అజెండా కూడా లేదన్నారు. కేంద్రంతో చెప్పి ఆటాడుకునేంత దమ్ము ఆ పార్టీ అధ్యక్షుడికి ఉంటే కేంద్రంతో చెప్పి విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయకుండా ఆపాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసే దిశగా ప్రతి గ్రామంలో సచివాలయాలను ఏర్పాటు చేస్తున్న ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామాల్లో దళారీ వ్యవస్థ, మధ్యవర్తులు, లంచం లేకుండా వ్యవస్థను పూర్తిగా ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వం ఇచ్చే సంక్షేమాన్ని నేరుగా లబ్ధిదారులకు అందించే విధానాన్ని తీసుకువచ్చిన జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, వైస్ఎంపీపీలు బంకురు రవికుమార్ సిద్దా జగన్నాథం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మిరమేష్, స్థానిక సర్పంచ్ గండి శంకరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.